యమున త్రిప్పుదురు. యీపళ్లెముపై వజ్రపుపొడి, ఆలివ్ నూనె కలిపి తరుచుగా పట్టించుచుందురు. యీవజ్రపు పొడి చాలావేగముగా తిరుగు పళ్లెముపై నుండుటచే "వజ్రం వజ్రేణ భిద్యతే" అను న్యాయప్రకారము వజ్రమును ఛేదించును. యీ రంపపుకోత చాలా సున్నితమైన పని. ౨౦ కారట్ల వజ్రమునకు సుమారొక మాసము పట్టును. యీయంత్రములన్నియు విద్యుత్సహాయమున నడుపబడును.

రంపపు కోతయంత్రమునుండి వజ్రము మరియొక పనివానియొద్దకు పంపబడును. అతడీవజ్రము నొక రాగిశంఖువు(Cone)లో బిగించి, ఆరాగిశంఖువును నిముషమునకు ౬౦౦ చుట్లు తిరుగు మరియొక యంత్రమునకు సిమెంటుతో అతికించును. మరియొక వజ్రమును ఒక పుల్ల కతికించి, తిరుగుచున్న యీ వజ్రముపైన స్వల్పశక్తితో కదల్పుటవలన తిరుగుచున్న వజ్రమును కావలసిన ఆకారమునకు తేవచ్చును. అచ్చటనుండి వజ్రము మెరుగుపెట్టుటకు పంపబడును.

మెరుగుపెట్టుట:

మెరుగుపెట్టుటలో రెండు విధానములు గలవు. మొదటిది క్రాయిట్జు విధానము; రెండవది బ్రిలియాండరు విధానము. మెరుగుపెట్టుటకు ముందు వజ్రము నొక శ్రావణమునకు బిగింతురు. ౧౦ అంగుళముల వ్యాసము గల యినుపపళ్లె మొకటి నిముషమునకు ౨౫౦౦ చుట్ల చొప్పున త్రిప్పబడుచుండును. దీనికికూడ వజ్రపు పొడిని పట్టించి వజ్రమును మెల్లగా దీనిపై ఆనించి పళ్లెమును త్రిప్పుదురు.

యీవిధముగా మొదట వజ్రము నాల్గుమూలలకును మెరుగుపెట్టుదురు. పిమ్మట వజ్రమును తీసి శ్రావణమందు మరియొక కోణములో బిగించి తిరిగి నాల్గుమూలలు మెరుగుపెట్టుదురు. పిమ్మట బ్రిలియాండరుపనివానియొద్దకు పంపుదురు. అతడు మిగిలిన భాగమంతకును మెరుగుపెట్టును. మెరుగుపెట్టుటలో భూతద్దము పెట్టి ప్రతిక్షణమును పరిశీలించుచుందురు. మెరుగుపెట్టుట పూర్తిఅయినపిమ్మట ద్రావకములో ఉడుకబెట్టి తీసి పరీక్షించి పిమ్మట అమ్మకమునకు



పంపుదురు. పనిముట్లు, యంత్రములు ఎల్లప్పుడును జాగ్రత్తగా పరీక్షచేయబడుచుండును.

యీవిధముగా 3 సం.లలో ముఖ్యమైన క్రొత్త పరిశ్రమ యొకటి యింగ్లండులో అభివృద్ధిపొందినది. యిప్పటికే ఆ ఫ్యాక్టరీలో యింగ్లీషువిద్యార్థులనేకులు తర్ఫీదైరి. పరిశ్రమ అభివృద్ధిచెందినకొలదియు ఎక్కువమంది యింగ్లీషువారు ప్రవీణులై, అసలు వారిని స్వదేశమునకు పంపుదురు.

యుద్ధకాలమందు తలదాచుకొనుటకు వెళ్లిన వారినుండి క్రొత్తవిద్య, పరిశ్రమ నేర్చుకొని బ్రిటిషు ప్రభుత్వము తమ దేశాభివృద్ధి చేసుకొనుచున్నది. భారతప్రభుత్వముగూడా అట్లెన్నడు చేయగల్గునో గదా !!!

పి. వి. రామమూర్తి.

---

## దొనె తహశీల్దారు

(వినోదకథ)

ఆంగ్లేయులు ఇప్పటివలె హృదయం లేకుండా సంచరించే రకంగా పూర్వ ముండేవారు కారు. కుంఫినీపరిపాలనలో ప్రజలతో చాలా కలసి మెలసి వ్యవహరించే ఉద్యోగు లుండేవారు. ప్రజల కష్టసుఖములను విచారించి వాటి నివారణోపాయములను వెదకి సర్వవిధములా సహాయకారులుగా ఉండేవారు. అందువలననే సర్ థామస్ మన్రోవంటి ఉద్యోగులు యిప్పటికీ ప్రజల హృదయాలలో జీవించే ఉన్నారు.

ఆకాలంలో సర్ వాల్టర్ స్మిత్ అనే ఆంగ్లేయుడు చిత్తూరుజిల్లాకలెక్టరుగా ఉండేవాడు. అది ౧౮౫౮-వ సంవత్సరము. అప్పటికప్పుడే ప్రభుత్వము కుంఫినీవారి చేతులలోనుండి పోయి విక్టోరియారాణి చేతులలోనికి వచ్చిన రోజులు. ఆయన ప్రజల కష్టసుఖాలను విచారించడానికి తనజ్యూరిస్‌డిక్షనులో గల గ్రామాల కన్నిటికీ తరుచు వెళుతూఉండేవాడు.

అటువంటప్పుడు అతను తరుచు మదనపల్లికి వెళ్లవలసివచ్చేది. అది అప్పటికే ఆరోగ్యానికి పేరుపడింది.

ఆరోగ్యకేంద్రాలలో అది ఒకటిగా ఉండేది. ఆయన అక్కడ క్యాంపుచేసినపుడల్లా ఆ ఊరిలో దోసెలమ్ము కొనే బ్రాహ్మ డొకడు ఆయన రాగానే నాలుగు దోసెలు, గ్లాసెడు వేడిపాలు పట్టుకువెళ్లి కలెక్టరు గారికి సమర్పించి వచ్చేవాడు. ఇలా చాలాకాలం ఆ బ్రాహ్మడి అతిథిసత్కారం కలెక్టరుగారికి ప్రాప్తించింది. ఆకాలంలో కాఫీఅలవాటు లేదు. ఇతర గ్రామాల్లో ఇంత ఆదరణ ఆ కలెక్టరుకు లభించ లేదు. మంచి ఆకలిమీద ఉన్నప్పు డీదోసెలూ, పాలూ కడుపులో పడేవేమో - ఆ కలెక్టరుగారి కా బ్రాహ్మడి మీద అపారమైన ప్రేమ పుట్టుకొచ్చింది.

ఒక పర్యాయము ఆయన వచ్చినపుడు కుర్చీలు విశేషంగాఇచ్చిగౌరవించి అయిదువందల రూపాయలు బహుమతీ ఈయబోయాడు. బ్రాహ్మడు "రామరామ" అని చెవులుమూసుకొని, "ప్రభూ! మీరు విష్ణ్వంశ సంభూతులు. మీ కాతిథ్యాన్ని నేనమ్ముకోడానికి రాలేదు" అని ఆ ధనాన్ని మెల్లిగా నిరాకరించాడు. ఆరాత్రి కలెక్టరుగారు ఆలోచనలో పడ్డారు— "ఏమి ఉపకారం చేస్తే యీ బ్రాహ్మడి ఋణం తీరుతుం"దని. ఆయన కొక చక్కటి ఉపాయం తోచింది. అప్పుడు కలెక్టరులు భూములు బహుమతీగా యీయవచ్చు. కాబట్టి ఆ బ్రాహ్మడిని పిలిచి "మహారాజా! కోరుకోవయ్యా, నీయిష్టంవచ్చిన చోట నూరు ఎకరాల భూమి యీనాంపట్టా వ్రాసియిస్తాను" అన్నాడు. "ఏలినవారి అనుగ్రహం ఉంటే చాలు, నూరు ఎకరాలు ఇచ్చినట్లే. నాకు ఏమీ వద్దు" అన్నాడు ఆ బ్రాహ్మడు. కలెక్టరు నివ్వెరపోయాడు. ఇంతటి నిష్కామసేవ ఆత డెన్నడూ కని విని యెరుగడు.

తుద కాకలెక్టరుగారు ఆ బ్రాహ్మడికేదైనా ఉపకారం చేయకపోతే పిచ్చెత్తే స్థితికి వచ్చాడు. మరోనా డా బ్రాహ్మణ్ణి పిలిపించి "భూసురోత్తమా! నీవు నావలన ఏదైనా ఉపకారం పొంది తీరాలి. లేకుంటే నేను నీఋణాన్ని పడిపోనా? నీవు ఏమి కోరుకొన్నా యిస్తాను" అని తెగ బలవంతపెట్టాడు. చివరకు బ్రాహ్మడు మొగమాటపడి "దేవరవారి కంత పట్టుదలగా ఉంటే ఒక తహసీల్దారుపని యిప్పించండి" అన్నాడు. వెంటనే ఆయన్ని కాళహస్తితహసీల్దారుగా వేశారు.

దోసెతహసీల్దారుగారు వస్తున్నా రని కాళహస్తిలో తెలిసిపోయింది. మందీ మార్బలం అంతా ఎదురేగి ఆయన్ని ఊరేగించి గ్రామంలోనికి తీసుకు వెళ్లి ఒక హవేలీలో ప్రవేశపెట్టారు. ఆ బ్రాహ్మడికి పప్పురామశర్మ అని తన పేరు దస్కతు పెట్టడంతప్ప మరొకటి రాదు. క్రింది ఉద్యోగులంతా చేసిపెడితే చివరను 'పప్పు రామశర్మవ్రాలు' అని దస్కతు చేసేవాడు. కాని దబాయింపువల్లా, లోకజ్ఞాన మున్నవాడవడంచేతా ప్రజలకు విశేషంగా రెమిషనూ అవీ యిప్పించి బాగా లంచాలు చెక్కేసి యిటు ప్రజచేత మెప్పు పొందాడు; అటు తానూ బాగుపడ్డాడు.

ఆయన చనిపోయేటప్పటికి తొమ్మిదివందల ఎకరాల మాగాణీ సంపాదించాడు. కలెక్ట రిస్తానన్న వందఎకరాలు ఎందుకూ? ఇప్పటికీ అతని సంతతివారు సుఖంగా అనుభవిస్తూ ఉన్నారు.

ప్రజల నెత్తిగొట్టి విర్రవీగేవారికంటె వారి కుపకారంచేసి తృణమో పణమో తిన్న యితడు యోగ్యుడు కాడూ?

పులవర్తి కమలావతీదేవి

